క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సూచనలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మంథనిలో నిధులు మంజూరైన పనులు వెంటనే చేపట్టాలని, ప్రారంభమైన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. మంథనిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంథని వద్ద గోదావరిపై చేపట్టిన వంతెన, శ్రీపాద రింగ్ రోడ్డు, పనుల్లో వేగం పెంచాలన్నారు. రూ.4.50కోట్లతో చేపట్టే ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి స్థల సేకరణ చేసి పనులు చేపట్టాలన్నారు. మంథని మున్సిపాలిటీలో రూ.10కోట్లతో మంజూరైన కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని సూచించారు. హమాలీ కార్మికులు, ఆటో కార్మికులకు ప్రభుత్వ స్థలాలు గుర్తించి ఇళ్ల నిర్మాణం చేసుకునేలా వీలు కల్పించాలన్నారు.

వరిపొలాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామ శివారులోని వరి పొలాలను ఏవో రామకృష్ణ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలతో వరిసాగులో తెగుళ్లు ఏర్పడి వరి పంట ఎర్రబారుతుందని రైతులకు వివరించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలు, పంటకోసం వాడే ఎరువుల గురించి అవగాహన కల్పించారు.

మంచినీటి బావి మరమ్మతు పనుల పరిశీలన



సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టిపల్లిలోని మంచినీటి బావి మరమ్మతు పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ పరిశీలించారు. మానేరు వాగులో ఉన్న మంచినీటి బావి నుంచి సుల్తానాబాద్ మున్సిపల్ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంది. కాగా మానేరు డ్యాం గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతికి మోటార్లు కాలిపోగా మరమ్మత్తు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏఈ రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 30ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి వర్షానికే తరచూ ప్రధాన రహదారిపైకి మురుగు నీరు చేరుతోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కోట్లాది రూపాయలతో ప్రధాన రహదారిలోని ఇళ్ల ఎదుట నుంచి భారీ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

రామగుండం రైల్వేస్టేషన్ సమస్యలపై వినతి

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ విశాల్ అర్జున్‌ను మంగళవారం డీఆర్‌యూసీసీ ప్రతినిధి అనుమాస శ్రీనివాస్ రైల్ నిలయంలో కలిశారు. రామగుండం రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్‌లో గడిపేందుకు అధిక ఛార్జీలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు అంతగా ఆసక్తి చూపించడం లేదన్నారు. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన ఉచిత వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా రైల్వే పార్కింగ్ స్టాండ్‌కు అధిక టెండర్ ధరలతో పొందిన కాంట్రాక్టర్ నిర్వహించలేక మధ్యలోనే వదిలి వెళ్లడంతో రైల్వే ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఈ ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్, పార్కింగ్ స్టాండ్‌పై తక్కువ ధరకు కోట్ చేసి రీ టెండర్లు పిలవాలని కమర్షియల్ మేనేజర్‌కు విన్నవించారు. కాగా దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

'దామిని'తో అప్రమత్తం

- పిడుగుపాటును ముందే గుర్తించే ప్రత్యేక యాప్

రామగుండం: రైతులు తమ పంటపొలాల్లో సాగు చేస్తున్న క్రమంలో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పడే సమయంలో పిడుగులు పడి ప్రాణాలు కోల్పోతుంటారు. పిడుగుపాటుకు వివిధ ప్రాంతాల్లో రైతులు మృత్యువాత పడిన ఘటనలు చూస్తున్నాం. పిడుగుపాటును ముందే గ్రహించి అప్రమత్తమై ప్రాణపాయం నుంచి తప్పించుకునేందుకు భారత వాతావరణ శాఖ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న భారతీయ ఉష్ణ మండల శాస్త్రీయ మెటారాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఐఐటీఎం -పూణే), భూమి వ్యవస్థ విజ్ఞాన సంస్థ (ఈఎస్‌ఎస్‌ఓ) ద్వారా ×దామిని× యాప్ అభివృద్ధి చేశారు.



దామిని యాప్ లోగో

యాప్ పని విధానం..

నిరంతరం పరిశోధన – పర్యవేక్షణ: దామిని యాప్ దేశవ్యాప్తంగా జరిగే పిడుగు కార్యకలాపాలను నిరంతరం పరిశీలిస్తుంది. ఇది జీపీఎస్ లోకేషన్ ఆధారంగా పనిచేస్తుంది. మీరు పని చేసే ప్రాంతానికి గరిష్టంగా 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగు పడే అవకాశం ఉంటే ముందే నోటిఫికేషన్ పంపిస్తుంది. ఈ సమాచారం మూడుగంటల ముందుగానే పిడుగుపాటు ప్రమాదం ఉన్నట్లు సంకేతాలు పంపించడంతో ప్రాణ, ఆస్తి నష్టం నుంచి బయటపడొచ్చు.

మ్యాప్‌లో వ్యూస్..

గరిష్టంగా 15నిమిషాల వ్యవధిలో జరిగిన పిడుగుపాటు ఘటనలను లోకేషన్ మ్యాప్‌పై చూపిస్తుంది. ఈ విధానం దేశవ్యాప్తంగా లైవ్‌లో పిడుగు స్థితిగతులను పరిశీలించే వీలుంటుంది. వీటితో పాటు పిడుగుపడే ప్రాంతాల్లో ఉన్న సమయంలో రక్షణ మార్గదర్శకాలు, సూచనలు, సలహాలను పంపిస్తూ వ్యక్తులను అప్రమత్తం చేస్తుంది.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

ఏదైనా ఆండ్రాయిడ్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో దామిని: లైటింగ్ అలర్ట్ అని సెర్చ్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఉచితంగానే సేవలు పొందవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆండ్రాయిడ్ ఫోన్లపై అవగాహన ఉన్న రైతులకు దామిని యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. నిరక్షరాస్యులైన రైతు కుటుంబాలలోని విద్యావంతులకు యాప్ పని విధానం వివరించి వారిని ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నాం. – కల్వల సతీశ్, మండల వ్యవసాయాధికారి, అంతర్గాం

వసతులు కల్పించడమే కాంగ్రెస్ ధ్యేయం



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో నగరాభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలో రూ.27కోట్లతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు ఆధునిక వాణిజ్య సదుపాయాలు కల్పించడమే ఈషాపింగ్ కాంప్లెక్స్ లక్ష్యమన్నారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం, పారదర్శకతపై ప్రత్యేక దృష్టిసారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, సింగరేణి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రైల్వేస్టేషన్లలో ఆటోపార్కింగ్ స్థలం కేటాయించాలి

గోదావరిఖని: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్లలో ఆటోలకు ఉచితంగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రావును కోరారు. మంగళవారం గోదావరిఖనికి వచ్చిన ఆయనను ఆటోడ్రైవర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆతహత్య చేసుకున్న ప్రతీ ఆటోడ్రైవర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆటో సంక్షేమ బోర్డు, ఏడాదికి కాకుండా నెలకు రూ.12వేలు, రూ.8వేలు ఇన్సూరెన్స్‌ను రూ.వెయ్యికి తగ్గించేలా చూడాలన్నారు. ఆటో బీమా ఏర్పాటు చేసి చనిపోయిన ఆటోడ్రైవర్ కుటుంబానికి రూ.5లక్షల బీమా వచ్చేలా సదుపాయం కల్పించాలన్నారు. దీనికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, గాజుల ముఖేష్‌గౌడ్, చైర్మన్ నీలారపు రవి పాల్గొన్నారు.

కేడీసీసీలో సౌభాగ్య పథకానికి అధిక వడ్డీ



ప్రచారంలో డీజీఎం బ్రహ్మానందరావు, మేనేజర్ గాంధీనాయక్

రామగిరి: కేడీసీసీ బ్యాంకు అందిస్తున్న సౌభాగ్య ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బ్రహ్మానందరావు అన్నారు. కేడీసీసీ బేగంపేట వారి ఆధ్వర్యంలో మంగళవారం ఆదివారంపేట, రాజాపూర్, బేగంపేట గ్రామాల్లో సిబ్బందితో కలిసి కరపత్రాలతో సౌభాగ్య ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంపై ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్‌లో సౌభాగ్య పథకంలో సాధారణ ప్రజలకు సుమారు 8శాతం, సీనియర్ సిటిజన్స్, మహిళలకు సుమారు 8.5శాతం వడ్డీ అందజేస్తుందని వివరించారు. వినియోగదారులు పూర్తి వివరాలకు బ్యాంకు సమయంలో 91210 14904 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఏజీఎంలు రాజశేఖర్, మహేశ్, మేనేజర్ హన్మంత్ రావు, గాంధీనాయక్, అసిస్టెంట్ మేనేజర్ సాగర్, ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ దీక్ష మహోత్సవం



నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

గోదావరిఖనిటౌన్: బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ దమ్మ దీక్ష తీసుకొని 70ఏళ్లు గడిచిన సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ ట్రస్ట్ భవన్‌లో బౌద్ధ దమ్మ దీక్ష మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేశ్ మాట్లాడారు. ప్రతీఒక్కరు అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాల అంకూస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శశిభూషణ్, ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, నాయకులు బాదె వెంకటేశం, మేకల సురేశ్, తిరుపతి, పానుగంటి రాజలింగం, రామగిరి రమేశ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

జూలపల్లి: రైతులు ఆయిల్‌పాం సాగు చేసి అధిక లాభాలు పొందాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ సంచాలకులు డా.గోపి సూచించారు. మండలంలోని అబ్బాపూర్ రైతువేదికలో మంగళవారం మూడు గ్రామాల రైతులకు దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన నిర్వహించారు. పప్పు ధాన్యాల సాగుకు, పత్తి రైతులు కపాస్ యాప్ ద్వారా అమ్మకానికి స్లాట్ బుకింగ్‌తో సత్వర విక్రయాలు సాధ్యమవుతాయని వివరించారు. ఏవో ప్రత్యూష, ఏఈవోలు కిరణ్మయి, రాకేశ్, శ్రీవాణి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఘనంగా అనఘాష్టమి వ్రతం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయంలో బహుళ అష్టమి పురస్కరించుకొని అర్చకులు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

• డీసీసీ అధ్యక్షుడిగా అవకాశమివ్వండి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పటిష్టత కోసం అంకిత భావంతో పనిచేస్తున్న తనకే పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని సీనియర్ నాయకుడు బుషణవేన రమేశ్‌గౌడ్ కోరారు. పార్టీ పరిశీలకుడిగా వచ్చిన డాక్టర్ జైకుమార్‌కు దరఖాస్తు మంగళవారం అందించినట్లు రమేశ్‌గౌడ్ తెలిపారు.

• డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడురోజుల జైలు

గోదావరిఖని: డ్రంకెన్ డ్రైవ్‌లో రెండోసారి పోలీసులకు దొరికిన ఆటోడ్రైవర్‌కు మూడురోజుల జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని సెకండ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ తీర్పు ఇచ్చినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 24మందిని కోర్టులో హాజరు పర్చగా రూ.48వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పత్తి చేను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

ధర్మారం: సాగు చేసిన పత్తిపంటను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామానికి చెందిన ఇస్లావత్ కిషన్‌నాయక్ మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిషన్‌నాయక్ కథనం ప్రకారంగా బొమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 679 ప్రభుత్వ భూమిలో రెండెకరాల విస్తీర్ణంలో పత్తిపంట సాగు చేయగా బంజేరుపల్లికి చెందిన కడారి కనుకయ్య, కడారి అయిలయ్య, కడారి భీరయ్య, కడారి కొమురయ్య, కడారి భూమయ్య, కడారి పోచయ్య, కడారి కనకయ్య, కడారి మహేశ్, బండారి మహేశ్, కడారి అయిలయ్యలు కలిసి తన పత్తిచేనును కొడవలితో కోసి పంటకు నష్టం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టపరంగా చర్య తీసుకుని పరిహారం ఇప్పించాలని కోరాడు.

• ఓదెల రైల్వేస్టేషన్లో సౌకర్యాలు కల్పించాలి

ఓదెల: కాజీపేట్ నుంచి బల్హార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని ఓదెలకు చెందిన బీజేపీ నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు, తాటికొండ కృష్ణమాచారి, పిల్లి సతీశ్ సికింద్రాబాద్‌లోని రైల్వేశాఖ జీఎంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఓదెలలో జీటీ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని విన్నవించారు. జీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

• పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సత్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది రవిని మంగళవారం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఐలయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు శంకర్, భాస్కర్, సురేశ్, అశోక్, వీరేశం, సదయ్య, లలిత, స్వామి, మల్లేశం, కేశవరెడ్డి, ప్రేంసాగర్, లక్ష్మి, భద్రయ్య ఉన్నారు.

• పర్సు అప్పగింత

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీటీఎస్ రాజీవ్ రహదారిపై మంగళవారం గుంటూరుపల్లెకు చెందిన మహిళ పర్సు పోగొట్టుకుంది. కాగా మోమిన్‌నగర్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ నజీర్‌కు పర్సు దొరికింది. వెంటనే పర్సును, అందులో ఉన్న నగదు రూ.3వేలు, సెల్‌ఫోన్, పత్రాలను ఎన్టీపీసీ ఎస్సై-2 లచ్చన్నకు అప్పగించారు. పోలీసులు పర్సులోని పత్రాల ఆధారంగా ఆమె చిరునామా తెలుసుకుని అప్పగించారు. నిజాయతీ చాటుకున్న నజీర్‌ను పోలీసులు సన్మానించారు. ఏఎస్సైలు లచ్చిరెడ్డి, తిరుపతి, కానిస్టేబుల్స్ అజయ్, శ్రీరాం పాల్గొన్నారు.

• కమ్యూనిటీ హాల్ సందర్శన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఆర్జీ-2 ఏరియా పోతనకాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఆర్జీ-2 ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ కార్మికులతో కలిసి సందర్శించారు. కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాలను పరిశీలించారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ అద్దె అధికంగా పెంచడం సరైన విధానం కాదన్నారు. సాధారణ అద్దె తీసుకోవాలని కోరారు. ఐఎన్‌టీయూసీ నాయకులు మల్లేశ్, సమ్మయ్య, అశోక్, శ్రీనివాస్, లక్ష్మణ్, మధు, తిరుపతిరెడ్డి, సదానందం, కార్మికులు పాల్గొన్నారు.

• అంతర్గాం ఎస్సైపై ఫిర్యాదు

గోదావరిఖని: అంతర్గాం ఎస్సై వేధింపుల నుంచి కాపాడాలని కోరుతూ రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావుకు మండల నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై బీజేపీ కార్యకర్తలను బెదిరిస్తూ పార్టీ మారాలని, అధికార కాంగ్రెస్‌లోకి రావాలని, లేకుంటే అంతు చూస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాషాయ కండువాలు మండలంలో కనపడ కూడదని, కాదుకూడదు అంటే కేసులు పెట్టి జీవితం నాశనం చేస్తానని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. నాయకులు సంజీవరెడ్డి, కందుల సంధ్యారాణి, అంతర్గాం మండల అధ్యక్షుడు సుభాష్ ఉన్నారు.

ఆలస్యంగా నడిచిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్

ఓదెల: సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రెండుగంటల పాటు ఆలస్యంగా నడవడంతో మంగళవారం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

మహిళా శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

రామగిరి: రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2025-26కు గాను నిర్వహించనున్న డీటీపీ(కంప్యూటర్), స్పోకెన్ ఇంగ్లీష్, జ్యూట్ బ్యాగ్స్ తయారీ నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకులుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత, అనుభవం గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం తెలిపారు. దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి రామగుండం-3 ఏరియా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో 21న సాయంత్రం 5లోపు అందజేయాలని సూచించారు.

గుంపులలో వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని గుంపులలో ఏఎస్సై కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.



పాలకుర్తి: మండల పరిధిలోని ధర్మారం క్రాస్‌రోడ్ వద్ద ఫోర్‌లైన్ రహదారిపై పెద్దపల్లి వైపు వెళ్లే మార్గంలో బస్‌షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది ధర్మారం క్రాస్‌రోడ్డుకు వచ్చి అక్కడి నుంచి బస్సుల ద్వారా పెద్దపల్లి, కరీంనగర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే స్థానికంగా బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిల్చుండి బస్సుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. దీనికి తోడు ఆ స్థలం చౌరస్తా కావడంతో బస్సులు, ఇతర వాహనాలు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆపుతుండటంతో రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద గల బస్‌షెల్టర్ కబ్జాకు గురైంది. బస్‌షెల్టర్ స్థలంలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తుండటంతో బస్సుల కోసం రోడ్డుపక్కన వేచిచూడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

గర్భిణులకు సేవలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ సూచించారు. ఆశా నోడల్ సూపర్‌వైజర్లతో మంగళవారం డీఎంహెచ్‌వో ఆఫీసులో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భం దాల్చిన వారి వివరాలను తొలి మూడు నెలల్లోనే నమోదు చేయాలన్నారు. వారికి అవసరమైన పరీక్షలను నిర్దేశిత సమయాల్లోనే చేయాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా టిఫా స్కాన్, రక్త పరీక్షలు నిర్వహిస్తారని వివరించాలన్నారు. వైద్యపరీక్షల కోసం ఆసుపత్రులకు సైతం 102 వాహన సేవలు వినియోగించుకునేలా అవగాహన పెంచాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ ఆఫీసు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో లక్ష్మీభవాని, దయామణి, ఉమామహేశ్వర్, మధుసూదన్ ఉన్నారు.

కమ్యూనిటీ హాళ్ల అద్దె పెంపు ఉపసంహరించుకోండి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియా పోతన కాలనీ, యైటింక్లయిన్‌కాలనీలోని కమ్యూనిటీ హాళ్ల అద్దె పెంపును యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక కుటుంబాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాళ్లపై బిజినెస్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు నష్టం కలిగించేలా సింగరేణి యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ యూనియన్ నుంచి హెచ్‌ఎంఎస్ యూనియన్‌లో చేరిన తాళ్లపెల్లి సంపత్‌కు ఆయన యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ దావు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు సారయ్య, రత్నాకర్‌రెడ్డి, నర్సయ్య, రవి, అఖిల్ పాషా, సందీప్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా కార్డియాక్ అరెస్ట్‌కు గురైతే అత్యవసర పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా సీపీఆర్ ఎలా చేయాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఇస్తున్నట్లు ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేశ్ బీరకాయల తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, రమేశ్ పాల్గొన్నారు.

కాకతీయ జూనియర్ కళాశాలలో..

స్థానిక మార్కండేయకాలనీలోని కాకతీయ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.వాణిశ్రీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానంపై ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్.రాజమౌళి, డాక్టర్ బి.కిరణ్‌కుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలకు ఎంపిక



సుల్తానాబాద్: పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థిని దాసోహం ఆరాధ్య చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కాసు శౌరెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

క్రీడాకారుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న తోటి క్రీడాకారులు

రామగిరి: సింగరేణిలో 30ఏళ్లుగా క్రీడల్లో చురుకుగా పాల్గొని, ఇటీవల పదోన్నతి పొంది బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వెళ్లిన క్రికెట్, హాకీ క్రీడాకారుడు దగ్గుల శ్రీనివాస్‌ను ఆర్జీ-3, ఏపీఏ క్రీడాకారులు సన్మానించారు. సెంటినరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్‌లో సత్కరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ ఫంక్షన్ హాల్‌లో డిగ్రీ, పీజీ విద్యార్థులు మంగళవారం 'ట్రినిటి తరంగ్' పేరిట ఫ్రెషర్స్ వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మమతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని సాధించే వరకు కష్టపడాలని మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ నీతూరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాంచందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.